సాక్షి ఖమ్మం

సోమవారం । 7 । ఏప్రిల్ । 2025



శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు (ఇన్‌సెట్) స్వామి వారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు



కల్యాణ ఘట్టాలు

- ఉదయం 9:50 గంటలు : కల్యాణ మండపానికి దేవేరుల ఆగమనం
- 10:22 : విశ్వక్సేన పూజ
- 10:33 : పుణ్యావాచనం
- 10:49 : శ్రీయోద్వాహం
- 11:13 : యోక్త్రా బంధనం, యజ్ఞోపవీత ధారణ
- 11:17 : శ్రీరాముడికి పాద ప్రక్షాళన
- 11:19 : అలంకరణ
- 11:26 : మధుపర్క నివేదన
- 11:33 : మహా సంకల్పం
- 11: 46 : కన్యాదానం
- 11:57 : పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి
- మధ్యాహ్నం 12:01 గంటలు : అభిజిత్ లగ్నంలో వధూవరుల తలలపై జీలకర్ర బెల్లం
- 12:13 : మాంగళ్య ధారణ
- 12:22 : తలంబ్రాల వేడుక
- 12:36 : స్వామి, అమ్మవార్లకు హారతి



సీతారాములపై జీలకర్ర, బెల్లం పెడుతున్న అర్చకులు



సీతమ్మ తల్లికి రామయ్య తరఫున మాంగళ్యధారణ



సీతారాములపై ముత్యాల తలంబ్రాలు...



జానకిరాముల కల్యాణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంలో వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

- అభిజిత్ లగ్నంలో ఒక్కటైన జానకిరాములు
- కల్యాణోత్సవానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి
- 11.57 గంటలకు మండపం వద్దకు ముఖ్యమంత్రి
- కల్యాణం అనంతరం సన్న బియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం

పులకించిన భక్త గిరి



కల్యాణాన్ని తిలకిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి దంపతులు, మంత్రి పొంగులేటి దంపతులు, హైకోర్టు జడ్జి జస్టిస్ సూరేపల్లి నందా, సీఎస్ శాంతికుమారి, ఎంపీ వద్దిరాజు తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో శ్రీ సీతారాముల కల్యాణం ఆదివారం అంగరంగ వైభవంగా సాగింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన భక్తులు తన్మయత్వంతో వేడుకలను కనులారా వీక్షించి పులకించిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సతీ సమేతంగా వేడుకలకు హాజరై స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ఉదయం 8 గంటలకు మొదట గర్భగుడిలో మూలవిరాట్‌కు లఘు కల్యాణం నిర్వహించారు. ఆ తర్వాత ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తూ మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. అక్కడ విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, శ్రీయోద్వాహం, యోక్త్రాబంధనం, అలంకరణ, కన్యాదానం తదితర కార్యక్రమాలు నిర్వహించాక అభిజిత్ లగ్నంలో స్వామి, అమ్మవార్ల శిరస్సులపై జీలకర్ర బెల్లం ఉంచి పెళ్లి తంతు కొనసాగించారు. మధ్యాహ్నం 12:13 గంటలకు మాంగళ్యధారణ జరగగా ఆ తర్వాత తలంబ్రాల వేడుక, హారతి సమర్పణతో వివాహ తంతు ముగిసింది. చివరగా సీతారాములకు తిరువీధి సేవ నిర్వహించారు.

లగ్నానికి కొంచెం ముందుగా..

షెడ్యూల్ టైం ప్రకారం ఉదయం 10:45 గంటలకు భద్రాచలం ఆలయానికి సీఎం రేవంత్‌రెడ్డి చేరుకోవాలి, అక్కడ పూజా కార్యక్రమాలు చూసుకుని ఉదయం 11:10 గంటలకు కల్యాణ మండపానికి రావాల్సి ఉంది. కానీ ఆయన ఆలయానికి చేరుకునే సరికే ఉదయం 11:32 గంటలైంది. దీంతో అభిజిత్ లగ్నం సమయానికి సీఎం రేవంత్‌రెడ్డి కల్యాణ మండపానికి చేరుకుని పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందిస్తారా అనే సందేహం ఏర్పడింది. సాధారణంగా సీతారాముల వివాహ తంతులో అలంకరణలు, మధుపర్కం నివేదించిన తర్వాత పట్టు వస్త్రాలు సమర్పిస్తుంటారు. మధుపర్కం కార్యక్రమం ముగిసినప్పటికీ సీఎం కల్యాణ మండపానికి చేరుకోకపోవడంతో ఆ తర్వాత ఘట్టమైన కన్యాదాన కార్యక్రమాన్ని కూడా అర్చకులు ప్రారంభించారు. ఈ క్రమంలో అభిజిత్ లగ్నానికి మూడు నిమిషాల ముందు.. అంటే 11:57 గంటలకు రేవంత్‌రెడ్డి కల్యాణ మండపం వద్దకు చేరుకున్నారు. వెంటనే పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఈ ఘట్టం ముగియగానే అభిజిత్ లగ్నంలో మధ్యాహ్నం 12:01గంటల సమయంలో వధూవరులైన సీతారాముల శిరస్సులపై అర్చకులు జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని ఉంచారు. ఆ తర్వాత ఇతర మంత్రులు, శ్రీరామదాసు, తూమూ నర్సింహదాసు వంశీయులు, త్రిదండి పీఠం, టీటీడీ తరఫున, ఇతర ప్రజాప్రతినిధులు, ప్రముఖులు వస్త్రాలు సమర్పించారు.

ప్రత్యేక ఏర్పాట్లు లేకుండా

సన్నబియ్యం లబ్ధిదారుడి ఇంట్లో భోజనం చేసే కార్యక్రమంలో భాగంగా బూర్గంపాడు మండలం సారపాకలోని ముత్యాలమ్మ గుడి దగ్గరున్న నాయక్‌పోడు తెగకు చెందిన బూరం శ్రీనివాస్ ఇంటికి సీఎం రేవంత్‌రెడ్డి చేరుకున్నారు. ఇంటి ముందు కారు దిగి అక్కడున్న ప్రజలకు అభివాదం, దగ్గరగా ఉన్న వారికి షేక్ హ్యాండ్ ఇస్తూ లోపలికి వెళ్లారు. శ్రీనివాస్ తల్లి పద్మావతి సీఎం రేవంత్‌రెడ్డికి ఎదురెళ్లి హారతి ఇచ్చి బొట్టు పెట్టి ఇంట్లోకి ఆహ్వానించారు. అప్పటికే సీఎం రాక సందర్భంగా 'ఎటువంటి ప్రత్యేక ఏర్పాట్లు చేయొద్దు. రోజు మీ ఇంట్లో ఎలా వంటలు చేస్తారో.. ఎలా తింటారో అవే ఏర్పాట్లు ఉండాలి' అని జిల్లా అధికారులు సూచించడంతో రెండు గదులు ఉన్న ఆ ఇంట్లో మొదటి గదిలో సీఎం భోజనం చేసేందుకు చాప పరిచారు.

మునక్కాయ కూర.. గోంగూర చట్నీ

భోజనానికి సీఎం రేవంత్‌రెడ్డి కూర్చున్న వరుసలో బూరం శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో పాటు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, సీఎస్ శాంతికుమారి కూర్చోగా ఎదురు వరుసలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కూర్చున్నారు. మంత్రి తుమ్మల భోజనం వడ్డింపు ఏర్పాట్లను పర్యవేక్షించే పనిలో భాగంగా నిల్చునే ఉన్నారు. శ్రీనివాస్ కుటుంబ సభ్యులు రోజువారీగా ఉపయోగించే స్టీలు పళ్లెంలో సన్నబియ్యంతో చేసిన అన్నం, పులిహోర, పాయసం, గోంగూర చట్నీ, మునక్కాయ, దోసకాయ, టమాటా కూరలను వడ్డించారు. వీటితో పాటు మజ్జిగ, పెరుగు, పానకం కూడా సిద్ధం చేశారు.



శ్రీనివాస్ తల్లిదండ్రులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయం

ఖమ్మం వంటలు బాగుంటాయి

వడ్డింపు మొదలు పెట్టగానే 'ఖమ్మం వంటలు బాగుంటాయి' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మొదటి ముద్ద తింటూనే.. 'ఇంతకు ముందు తుమ్మలనే ఈ వంటలు నాకు పరిచయం చేశారు' అని ఆయన గతాన్ని గుర్తు చేసుకున్నారు. భోజనం చేస్తూ మధ్యమధ్యలో ప్రభుత్వం అందిస్తున్న మహిళలకు ఉచిత బస్, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత కరెంట్ పథకాలు ఎలా ఉన్నాయంటూ శ్రీనివాస్ కుటుంబ సభ్యులను సీఎం అడిగారు. పెరుగుతో భోజనం పూర్తి చేశారు. అంతకు ముందే రేవంత్‌రెడ్డికి వడ్డించే భోజనాన్ని ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బందితో పాటు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు (టెస్ట్ అండ్ టేస్ట్) పరిశీలించారు.

వీళ్లకు ఉద్యోగం చూడండి..

భోజనం పూర్తయిన తర్వాత శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో సీఎం మాట్లాడారు. ఈ సందర్భంగా తమ కుటుంబానికి సాయం చేయాలంటూ సీఎంను పద్మావతి కోరారు. దీంతో వారికి అవసరమైన సాయం చేయాలంటూ కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు సీఎం ఆదేశాలు జారీ చేశారు. చివరగా శ్రీనివాస్ తల్లిదండ్రులు శంకర్‌రావు, పద్మావతికి రేవంత్‌రెడ్డి వస్త్రాలు అందజేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2:21 గంటల వరకు మొత్తంగా మూడు గంటల ఇరవై ఒక్క నిమిషాల పాటు సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటన కొనసాగింది.

న్యూస్‌రీల్

ఈనెల 10 నుండి ఉచిత పాలిసెట్ శిక్షణ

సింగరేణి(కొత్తగూడెం): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు సింగరేణి వ్యాప్తంగా సంస్థ పాఠశాలల్లో ఈనెల 10 నుండి మే 10 వరకు ఉచితంగా పాలిసెట్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ విషయాన్ని సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి పాలిసెట్ రాయాల్సి ఉండగా, త్వరలోనే నోటిఫికేషన్ రానుందని చెప్పారు. ఈమేరకు విద్యార్థులు ఉచిత శిక్షణ ద్వారా సిద్ధం కావాలని, తద్వారా మంచి ర్యాంకులు సాధించి పాలిటెక్నిక్ పూర్తి చేస్తే భవిష్యత్‌లో మెరుగైన అవకాశాలు ఉంటాయని తెలిపారు. సింగరేణి పాఠశాలలే కాక ఇతర పాఠశాలల్లో ఎస్సెస్సీ పూర్తిచేసిన విద్యార్థులు వివరాల కోసం సింగరేణి పాఠశాలల హెచ్‌ఎంలను సంప్రదించాలని సూచించారు.

బీట్ అధికారులు ఏడుగురికి పదోన్నతి

పాల్వంచరూరల్: భద్రాద్రి జోనల్ పరిధి అటవీ శాఖలో ఏడుగురు బీట్ అధికారులకు సెక్షన్ ఆఫీసర్లుగా పదోన్నతి లభించింది. ఇందులో భద్రాద్రి జిల్లా నుంచి ముగ్గురు, ఖమ్మం జిల్లా నుంచి నలుగురు ఉన్నారు. పాల్వంచ వైల్డ్‌లైఫ్ డివిజన్ యానంబైల్ రేంజ్ కిన్నెరసాని బీట్ ఆఫీసర్ బట్టు రాములు, ఇల్లెందు డివిజన్ కాచనపల్లి రేంజ్ బీట్ ఆఫీసర్ బి.లక్ష్మణ్, ఇల్లెందు రేంజ్ బీట్ ఆఫీసర్ వి.ముత్తయ్య, తల్లాడ రేంజ్ బీట్ ఆఫీసర్ కే.వీ.బీ.వీ.ప్రసాదలింగం, గుగులోత్ ఉపేందర్, సత్తుపల్లి రేంజ్ బీట్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, కారేపల్లి రేంజ్ బీట్ ఆఫీసర్ వి.నాగరాజు పదోన్నతి పొందిన వారిలో ఉన్నారు. ఇందుకు సంబంధించి భద్రాద్రి జోనల్ సీసీఎఫ్ భీమానాయక్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

కిన్నెరసానిలో సందడి

పాల్వంచరూరల్ : పాల్వంచ మండలం కిన్నెరసానికి ఆదివారం పర్యాటకులు పోటెత్తారు. శ్రీరామనవమికి భద్రాచలం వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో కిన్నెరసానిని కూడా సందర్శించారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 428మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా రూ.15,355, 200మంది బోటు షికారుతో రూ.11వేల ఆదాయం లభించింది.

విద్యార్థుల లక్ష్యాలకు అనుగుణంగా బోధన

డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

వైరా: ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడానికే పరిమితం కాకుండా విద్యార్థుల లక్ష్యాలను గుర్తించి అందుకు అనుగుణంగా బోధనలో మార్పులు చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. భద్రాచలంలో కల్యాణానికి హాజరైన డిప్యూటీ సీఎం హైదరాబాద్ వెళ్తూ తన స్వగ్రామమైన వైరా మండలం స్నానాల లక్ష్మీపురం వచ్చారు. అక్కడ భట్టి విక్రమార్క – నందిని దంపతులు గ్రామంలోని శ్రీ రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు చేశాక అక్కడ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆతర్వాత ఇటీవల గ్రూప్–1లో ర్యాంకు సాధించిన వైరాకు చెందిన సంగెపు లక్ష్మీ సాహితిని భట్టి సన్మానించారు. అనంతరం వైరాకు వచ్చిన డిప్యూటీ సీఎం తెలంగాణ గురుకుల బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. ఇదే ప్రాంగణంలో ఇంటిగ్రేటెడ్ గురుకుల భవన నిర్మాణాలు చేపట్టనున్న నేపథ్యాన స్థలాన్ని పరిశీలించి అధికారులతో చర్చించారు. ఆతర్వాత ఆయన అరుగుపై కూర్చుని విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలల్లో సౌకర్యాలు ఎలా ఉన్నాయి, మెనూ సక్రమంగా అమలవుతోందా, రాత్రివేళ కేర్ టేకర్లు ఉంటున్నారా అని తీస్తూ వివరాలు సేకరించారు. ఆపై డైనింగ్ హాల్‌కు వెళ్లి మెనూ చార్ట్ ఆధారంగా ఏమేం వండారో తెలుసుకున్న భట్టి విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కాగా, డిప్యూటీ సీఎం వచ్చిన సమయాన పాఠశాల ప్రిన్సిపాల్ రమ లేకపోవడంతో ఇన్‌చార్జ్ వార్డెన్ వివరాలు వెల్లడించింది. అంతకు ముందు వైరాలో 100 పడకల ఆస్పత్రి భవన నిర్మాణ స్థలాన్ని కూడా డిప్యూటీ సీఎం పరిశీలించారు. ఈకార్యక్రమాల్లో వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఏసీపీ ఎం.ఏ.రెహమాన్‌తో పాటు నూతి సత్యనారాయణ, శీలం వెంకట నర్సిరెడ్డి, దొడ్డపుల్లయ్య, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏదునూరి సీతారాములు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినిలతో కలిసి భోజనం చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, ఎమ్మెల్యే రాందాస్ నాయక్

జిల్లా జైలులో జైళ్లశాఖ డీజీ తనిఖీ

ఖమ్మంరూరల్: రూరల్ మండలం రామన్నపేటలోని జిల్లా జైలును జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్యామిశ్రా ఆదివారం సందర్శించారు. ఈసందర్భంగా ఖైదీలతో మాట్లాడి మెనూ, వైద్య సదుపాయం, న్యాయ సాయం అందుతోందా అని ఆరాతీశారు. అలాగే, లైబ్రరీ, వంటగది, ఆస్పత్రిని తనిఖీ చేసిన ఆమె జైలు ఆవరణలో బీరువాలు, బెంచీలు, ఫినాయిల్ తయారీ వివరాలు తెలుసుకున్నారు. తయారీ, అమ్మకం మరింత పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్, వరంగల్ రేంజ్ డీఐజీ ఎం.సంపత్, జైలు సూపరింటెండెంట్ ఏ.శ్రీధర్, జైలర్లు ఎ.సక్రు, జి.లక్ష్మీనారాయణ, ఉద్యోగులు పాల్గొన్నారు.



జైలు ఆవరణలో పరిశీలిస్తున్న సౌమ్యామిశ్రా

నేటి నుంచి ఎస్సెస్సీ జవాబుపత్రాల మూల్యాంకనం

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి వార్షిక పరీక్షలు ఇటీవల ముగిసిన నేపథ్యాన జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారం నుంచి చేపట్టనున్నారు. ఇందుకోసం ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో కేంద్రం ఏర్పాటుచేయగా, డీఈఓ సోమశేఖరశర్మ ఆదివారం ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడారు. సోమవారం నుంచి 15వ తేదీ వరకు వాల్యూయేషన్ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాకు 2,32,000జవాబుపత్రాలు చేరాయని, తాను క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరిస్తానని పేర్కొన్నారు. అలాగే, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్‌గా ఖమ్మం రూరల్ ఎంఈఓ ఎం.శ్రీనివాస్, తొమ్మిది మంది అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్లు, 100మంది స్పెషల్ అసిస్టెంట్లు మొత్తంగా 1,100మంది విధులు నిర్వర్తిస్తారని తెలిపారు. విధులు కేటాయించిన ఉద్యోగులు హాజరుకాకపోతే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డీఈఓ వెంట పరీక్షల విభాగం ఏసీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు నేడు పట్టాభిషేకం

ముఖ్య అతిథిగా హాజరుకానున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణ మహోత్సవం జరిగిన మరుసటి రోజున పట్టాభిషేకం వేడుక నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో సోమవారం రామచంద్రమూర్తిని పట్టాభిషిక్తుడిని చేయనున్నారు. ఈ వేడుకకు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు.

గవర్నర్ పర్యటన షెడ్యూల్ ఇలా..

- ఉదయం 9–45కు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో హెలికాప్టర్ ప్రారంభం
- 10.45కు సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు
- 11.20 గంటలకు గెస్ట్‌హౌస్ నుంచి రోడ్డు మార్గంలో శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానానికి వస్తారు
- 11.45కు దేవస్థానం నుంచి మిథిలా స్టేడియానికి చేరుకుంటారు
- 12.45 వరకు స్టేడియంలో పట్టాభిషేక మహోత్సవాన్ని వీక్షిస్తారు
- 12,45కు స్టేడియం నుంచి బయలుదేరి 1 గంటకు ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు చేరుకుంటారు
- 1.25కు హెలీపాడ్‌కు.. ఆతర్వాత 1.30కు హెలీకాప్టర్‌లో పయనం

సన్నాలు పక్కదారి పట్టకుండా..

- బియ్యం పంపిణీపై అధికార యంత్రాంగం నిఘా
- షాపుల్లో రోజువారీ తనిఖీ, నివేదికలు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల నుంచి రేషన్‌షాపుల ద్వారా కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తోంది. జిల్లాలో 748 రేషన్ దుకాణాలు ఉండగా, 4,10,988 కార్డులకు గాను 11,48,031మంది లబ్ధిదారులకు బియ్యం అందజేయాల్సి ఉంది. ఇందుకోసం 7,200మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇప్పటికే షాప్‌లకు చేరవేశారు. అయితే, ఇన్నాళ్లు దొడ్డుబియ్యం కావడంతో షాపులకు రాని వారు కూడా సన్నబియ్యం తీసుకునేందుకు బారులు దీరుతున్నారు. ఈనేపథ్యాన ఎక్కడా బియ్యం పక్కదారి పట్టకుండా ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు నిఘా పెంచారు.

ప్రతీరోజు తనిఖీలు

ఎక్కడ కూడా సన్నబియ్యం పక్కదారి పట్టొదన్న ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు రోజువారీగా రేషన్ షాప్‌ల్లో తనిఖీ చేస్తున్నారు. జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ స్వయంగా పలు షాపులను పరిశీలిస్తుండగా, సివిల్ సప్లయీస్ డీటీలతోపాటు తహసీల్దార్లు సైతం తమ పరిధిలోని షాప్‌లను సందర్శిస్తున్నారు. గతంలో మాదిరి ఎవరైనా బియ్యం తీసుకోకపోతే డీలర్లు ఇతరులకు అధిక ధరతో అమ్ముకునే అవకాశం ఏర్పడుతుందనే భావనతో ఈ తనిఖీలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. షాప్‌కు కేటాయించిన బియ్యం, రోజువారీ పంపిణీ, మిగిలిన స్టాక్ వివరాలు నమోదు చేస్తూ ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తున్నట్లు సమాచారం.



రేషన్ షాప్‌లో తనిఖీ చేస్తున్న డీఎస్‌ఓ చందన్‌కుమార్ (ఫైల్)

దందాకు చెక్‌పెట్టేలా..

గతంలో అక్రమార్కులతో కలిసి కొందరు డీలర్లు చేతులు కలిపి దొడ్డు బియ్యం చేరవేసేవారు. అంతేకాక ఎవరైనా కార్డుదారులు బియ్యం వద్దంటే వారికి డబ్బు ఇస్తూ ఆ బియ్యాన్ని పక్కదారి పట్టించడం చోటు చేసుకుంది. ప్రస్తుతం సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యాన అలా జరగకుండా దందాకు చెక్ పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఉద్యోగులు ముమ్మరంగా తనిఖీలు చేపడుతూ నిఘాను పటిష్టం చేశారు.

దుకాణాలు తనిఖీ చేస్తున్నాం




రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. ఈక్రమంలో ఎక్కడా బియ్యం పక్కదారి పట్టకుండా తనిఖీలు చేస్తున్నాం. షాపుల్లో పరిశీలిస్తూ స్టాక్ వివరాలు నమోదు చేయించడమే కాక ప్రతిరోజు జిల్లా, రాష్ట్రస్థాయి అధికారులకు నివేదికలు పంపిస్తున్నాం.

– చందన్‌కుమార్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి, ఖమ్మం

బియ్యంలో తరుగు

నేలకొండపల్లి: పేదలకు ప్రభుత్వం రేషన్‌షాప్ ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తుండగా, అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో అక్కడక్కడా తరుగు వస్తోంది. ఇన్నాళ్లు దొడ్డుబియ్యం కావడంతో ఎంత ఇచ్చినా పట్టించుకోని లబ్ధిదారులు.. ఇప్పుడు మాత్రం డీలర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, తమకు గోదాం నుంచే తరుగుతో వస్తున్నాయని, కాంటా కూడా వేయడం లేదని డీలర్లు వాపోతుండడం గమనార్హం. ఇటీవల నేలకొండపల్లి మండలంలోని పలు గ్రామాల్లో కార్డుదారులు బియ్యం తీసుకుని మరోచోట కాంటా వేయించారు. ఇందులో ఓ కార్డుదారుడికి 18 కిలోలకు గాను అర కేజీ తక్కువగా వచ్చాయి. ఇదే పరిస్థితి చాలా చోట్ల ఉండడంతో డీలర్లను నిలదీస్తున్నారు. కానీ తమకు బియ్యం కేటాయించే క్రమాన మండల స్థాయి స్టాక్ పాయింట్ వద్ద కాంటా వేయడం లేదని.. చేసేదేం లేక తాము తక్కువగా ఇస్తున్నామని డీలర్లు వాపోతున్నారు. ఈ విషయమై నేలకొండపల్లి తహసీల్దార్ జె.మాణిక్‌రావ్‌ను వివరణ కోరగా... కారణాలు ఏమైనా కార్డుదారులకు ఇచ్చే బియ్యంలో గింజ కూడా తగ్గొద్దని, అలా జరిగితే డీలర్లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతేకాక గోదాంల వద్ద బియ్యం బస్తాలు కాంటా వేసేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు..



18 కిలోలుగా ఇవ్వగా.. అర కేజీ తక్కువగా ఉన్న బియ్యం

క్లుప్తంగా

రిటైర్‌మెంట్ ఫలితం అందక మనోవేదన

ఖమ్మం సహకారనగర్: విశ్రాంత ఉద్యోగ, ఉపాధ్యాయులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్లు అందక మనోవేదనకు గురవుతున్నారని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కూరపాటి పాండురంగయ్య మృతిపై వారు ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. ఆయన జూలైలో ఉద్యోగ విరమణ చేసినా నేటికీ రిటైర్మెంట్ బెనిఫిట్లు అందక మానసికంగా ఇబ్బంది పడ్డారని, అనారోగ్యానికి గురైనా వైద్యం చేయించుకోలేకపోయారని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు ఎప్పటికప్పుడు బెనిఫిట్లు మంజూరు చేయాలని కోరారు.

108లో గర్భిణికి ప్రసవం



శిశువుతో 108 సిబ్బంది

పెనుబల్లి: ఆస్పత్రికి తరలిస్తున్న గర్భిణి మార్గమధ్యలోనే పురిటినొప్పులు పెరగడంలో 108 వాహనంలో ప్రసవించింది. మండలంలోని తాళ్లపెంట గ్రామానికి చెందిన డి.సుక్కీ పురిటి నొప్పులతో బాధపడుతుండగా 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దీంతో వాహనంతో వచ్చిన సిబ్బంది ఆమెను పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే సుక్కీకి నొప్పుల తీవ్రత పెరగడంతో సిబ్బంది ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగానే ఉండగా, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

ధాన్యం కొనుగోళ్లు పరిశీలించిన డీఎస్‌ఓ



ధాన్యం తేమ శాతాన్ని పరీక్షిస్తున్న డీఎస్‌ఓ

కూసుమంచి/ముదిగొండ: కూసుమంచి, ముదిగొండ మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డీఎస్‌ఓ) చందన్‌కుమార్ ఆదివారం తనిఖీ చేశారు. కూసుమంచి మండలం పాలేరుతో పాటు ముదిగొండ మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీ చేసిన ఆయన ఇప్పటివరకు చేపట్టిన కొనుగోళ్లపై నిర్వాహకులను ఆరా తీశారు. అలాగే, రైతులతో మాట్లాడి ధాన్యం తేమ శాతం నిర్ధారణ, గన్నీ బ్యాగ్‌ల కేటాయింపు, రవాణాలో సమస్యలు ఎదురవుతున్నాయా అని తెలుసుకున్నారు. ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యాన కేంద్రాల వద్ద టెంట్ వేయించడమేకాక తాగునీరు అందుబాటులో ఉంచాలని, రైతులకు కుర్చీలు వేయించాలని సెంటర్ల ఇన్‌చార్జిలకు సూచించారు.

ఎన్నెస్పీ కాల్వలో పడి వ్యక్తి మృతి



జయరాజు (ఫైల్)

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెంకు చెందిన వ్యక్తి ఎన్నెస్పీ మెయిన్ బ్రాంచ్ కెనాల్‌లో కాలు జారి పడగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు... అన్నారుగూడెంకు చెందిన కటుకూరి జయరాజు(58) ఈనెల 4న గోపాలపేట సమీపాన పొలంలో పనికి వెళ్లాడు. మధ్యాహ్నం తాగునీటి కోసం గొర్ల బ్రిడ్జి వద్ద కాలువలోకి దిగగా, నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో కాలు జారి పడి కొట్టుకుపోయాడు. కుటుంబీకులు, పోలీసులు గాలిస్తుండగా ఆదివారం ఉదయం లోకవరం సమీపాన ఆయన మృతదేహం లభ్యమైంది. ఈమేరకు జయరాజు కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సుబాబుల్ లోడింగ్‌కు వచ్చిన లారీ డ్రైవర్ మృతి

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ సమీపాన వే బ్రిడ్జి వద్ద ఓ లారీ డ్రైవర్ మృతి చెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం చౌటిగూడెంకు చెందిన లారీ డ్రైవర్ కొంపల్లి వెంకటేశ్వరరావు(56) శనివారం సుబాబుల్ కర్ర లోడింగ్‌కు వచ్చాడు. ఆయన లారీలో విశ్రాంతి తీసుకుంటూ మృత్యువాత పడ్డాడు. వే బ్రిడ్జి నిర్వాహకులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా, ఆయన మృతికి కారణాలు తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని ఆర్కే ఫౌండేషన్ బాధ్యుల సాయంతో మధిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో గ్రానైట్ కార్మికుడు...

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి క్రాస్ వద్ద ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో కటింగ్ ఆపరేటర్ కనపర్తి లక్ష్మయ్య(55) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. ముదిగొండ మండలం సువర్ణాపురానికి చెందిన లక్ష్మయ్య పనిలో ఉండగా, మధ్యాహ్నం కళ్లు తిరిగి కింద పడడంతో సహచరులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆయన గుండెపోటుతో అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో లక్ష్మయ్య కుమారుడు రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ ముష్క రాజు తెలిపారు.

వైభవంగా జానకిరాముల కల్యాణం

జమలాపురానికి వేలాదిగా హాజరైన భక్తులు



ఎర్రుపాలెం : జమలాపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



ఎర్రుపాలెం : కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని వకుళామాత స్టేడియంలో ఆదివారం శ్రీ సీతారామచంద్రస్వామి వార్ల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత యాగశాల నుంచి కల్యాణమూర్తులను పల్లకీలో మండపానికి తోడ్కొని రాగా.. పూజల అనంతరం భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి ఆలయం నుండి వచ్చిన ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను ఆలయ ఈఓ జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి దంపతులు సమర్పించారు. ఆతర్వాత ముఖ్య అర్చకులు ఉప్పల మురళీమోహన్‌శర్మ దంపతుల నేతృత్వాన పురాణం రవికుమార్‌శర్మ కల్యాణక్రతువు నిర్వహించగా వ్యాఖ్యాతగా ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ వ్యవహరించారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన మధ్యాహ్నం 12గంటల వరకు కల్యాణం పూర్తిచేశారు. ఆతర్వాత భక్తులకు అన్నదానం ఏర్పాటుచేయడమే కాక స్వామి,అమ్మవార్ల ఉత్సవ మూర్తులను హనుమత్ వాహనంపై ఊరేగింపు చేశారు. అలాగే, వెంకటాపురంలోని శ్రీవారి దత్తత దేవాలయంలో కూడా సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయ మాజీ చైర్మన్ ఉప్పల కృష్ణమోహన్‌శర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు రాజీవ్‌శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.



ముదిగొండ : ముత్తారంలో కల్యాణం సందర్భంగా మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు

సాయంసంధ్యా సమయాన...

ముదిగొండ: ముదిగొండ మండలం ముత్తారంలో స్వయంభూగా వేంచేసి ఉన్న శ్రీసీతారామచంద్రస్వామి వారి కల్యాణాన్ని ఆదివారం సాయంసంధ్యా సమయాన నిర్వహించారు. దేశమంతటా శ్రీరాముడి కల్యాణం ఉదయం నిర్వహిస్తే.. వంద ఏళ్లుగా ఇక్కడ సాయంత్రం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా పెద్దసంఖ్యలో హాజరైన భక్తుల సమక్షాన వంశపారంపర్య ధర్మకర్త వనం వెంకటనాగేశ్వరరావు తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. ఆతర్వాత ఆలయ ప్రధాన అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు, శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యాన కల్యాణక్రతువు నిర్వహించారు. ఈ పూజల్లో వనం వెంకటనాగేశ్వరరావు, పరుచూరి ప్రసాదరావు, ఆలయ చైర్మన్ తుళ్లూరి జీవన్, ఈఓ సమత, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు అమ్మయ్య, తిరపయ్య, వీరభద్రం, శ్రీనివాసరావు, మోహన్‌రావు, మమత, అజయ్, నాగయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

కోడి కోయలేం.. తినలేం..!

- బర్డ్‌ఫ్లూ తర్వాత అమాంతం పెరిగిన ధర
- లభ్యత లేకపోవడమే కారణమంటున్న వ్యాపారులు
- కిలో చికెన్ ధర రూ.280 పైమాటే...



ఓ షాప్‌లో చికెన్ కొడుతున్న వ్యాపారి

సత్తుపల్లి: కోడిని చూడగలం కానీ కోయలేము.. తినలేము అన్నట్లుగా పరిస్థితులు నెలకొన్నాయి. చికెన్ ధరలు అమాంతం పెరగడమే ఇందుకు కారణమవుతోంది. జనవరి నెలలో బర్డ్‌ఫ్లూ వ్యాప్తి ప్రచారంతో చికెన్ తినడానికి జనం విముఖత కనబరిచారు. ఆ సమయాన చికెన్ కేజీ ధర రూ.140 నుంచి రూ.160 పలకగా.. ఫిబ్రవరిలో కోళ్ల పరిశ్రమ నిర్వాహకులు మేళాలు నిర్వహిస్తే అక్కడకు పెద్దసంఖ్యలో జనం హాజరైనా కొనుగోలు మాత్రం ముందు రాలేదు. ఇక మార్చిలో రంజాన్ మాసం ప్రారంభమయ్యాక చికెన్ అమ్మకాలు కొద్దికొద్దిగా పెరగడం మొదలైంది. ఆ నెలంతా స్కిన్‌లెస్ చికెన్ కేజీ ధర రూ.220 నుంచి రూ.240 వరకు పలకగా.. ఈనెలలో మాత్రం రూ.280 నుంచి రూ.300వరకు పలుకుతుండడం గమనార్హం. దీంతో బర్డ్ ఫ్లూ భయం పోయినా ధర మాత్రం బెంబేలెత్తిస్తున్నట్లవుతోంది.

కొందరే పెంచడంతో...

బర్డ్‌ఫ్లూకు తోడు రకరకాల కారణాలతో జనవరి, ఫిబ్రవరి నెలల్లో చికెన్ ధరలు అమాంతం పడిపోయాయి. దీంతో అమ్మకాలు లేక పౌల్ట్రీ ఫారాల నిర్వాహకులు కోళ్ల పెంచేందుకు వెనుకడుగు వేశారు. ఫలితంగా కొన్ని హెచరిస్ కంపెనీల నిర్వాహకులు మాత్రమే కోళ్ల పెంచారు. ఇప్పుడు తినడానికి జనం ఆసక్తి చూపిస్తున్నా.. కోళ్ల లభ్యత లేకపోవడంతో ధర పెరుగుతోంది. లైవ్ కోడి కేజీ ధర రూ.150 నుంచి రూ.160 పడుతున్నందున తాము ధర పెంచి అమ్మకం తప్పడం లేదని సెంటర్ల నిర్వాహకులు చెబుతున్నారు.

మటన్ రూ.వెయ్యి..

రెండు నెలల క్రితం బర్డ్ ఫ్లూ సోకుతుందనే ప్రచారంతో జనం చికెన్ తినకుండా మటన్, చేపల వైపు దృష్టి సారించారు. తద్వారా డిమాండ్ పెరగడంతో రూ.900వరకు ఉన్న మటన్ కేజీ ధర రూ.వెయ్యికి పెంచారు. అలాగే, తెల్ల చేపలు(లైవ్) కూడా కేజీ రూ.200 ధర పలికాయి. ఇప్పుడు చికెన్ ధర కూడా రూ.300 మార్క్‌కు చేరుతుండడంతో అది తినలేక.. మటన్ కొనలేక మాంసం ప్రియుల్లో ఆవేదన వ్యక్తవుతోంది. కాగా, కోళ్ల లభ్యత పెరిగాక మరో చికెన్ ధర తగ్గే అవకాశముందని సెంటర్ల నిర్వాహకుల ద్వారా తెలిసింది.

ఇష్టమున్నా దూరమయ్యాం..



మా ఇంట్లో చికెన్ అంటే అందరికీ ఇష్టమే. కానీ బర్డ్‌ఫ్లూ భయంతో వండడం మానేశాం. రంజాన్ సమయంలో వాడకం మొదలుపెట్టినా ఇప్పుడు ధర పెరిగింది. బర్డ్‌ఫ్లూ ప్రచారం జరిగినప్పుడు ఫంక్షన్లలోనూ చికెన్ వంటకాలు తగ్గాయి.

– ఎం.డీ.ఆబీద్, సత్తుపల్లి

మూడు నెలలు నష్టపోయాం..



బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో అమ్మకాలు లేకున్నా మూడు నెలల పాటు అద్దె, జీతాలు చెల్లించడంతో రూ.2.50 లక్షల మేర నష్టం వచ్చింది. ఇప్పుడు చికెన్ ధరలు పెరిగి వ్యాపారం సాగడం లేదు. ఆదివారాల్లోనే ఓ మోస్తరు వ్యాపారం ఉంటోంది.

– ఎస్.కే.ఖాసీం, చికెన్ వ్యాపారి, సత్తుపల్లి

సీపీఎం రాష్ట్ర నాయకుడు శ్రీకాంత్ మృతి

- మధురైలో గుండెపోటుతో హఠాన్మరణం
- నివాళులర్పించిన రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు యర్రా శ్రీకాంత్(62) గుండెపోటుతో ఆదివారం మృతి చెందారు. మధురైలో జరుగుతున్న పార్టీ అఖిల భారత మహాసభల్లో పాల్గొనేందుకు జిల్లా నాయకులతో కలిసి ఆయన వెళ్లారు. ఈక్రమాన శనివారం గుండెపోటు రావడంతో మధురైలోని అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స కొనసాగుతుండగానే ఆదివారం మరోమారు తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించారు. కాగా, శ్రీకాంత్‌కు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆయన భార్య సుకన్య ఐద్వా నాయకురాలిగా కొనసాగుతుండగా, రెండు సార్లు ఖమ్మం కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు.

పార్టీలు, సంఘాల నేతల సంతాపం

శ్రీకాంత్ మృతి చెందినట్లు తెలియగానే పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పి.సుదర్శన్‌రావు తదితరులు మధురైలోని అపోలో ఆస్పత్రికి వెళ్లి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. పార్టీ కేంద్ర, రాష్ట్ర కమిటీ నాయకులు ఎం.సాయిబాబు, జూలకంటి రంగారెడ్డి, జ్యోతి, బండారు రవికుమార్, పాలడుగు భాస్కర్, ఎం.డీ.జహంగీర్, డీ.జీ.నర్సింహారావు, భారతి, సుధాకర్‌రెడ్డి తదితరులతో పాటు వివిధ జిల్లాల నాయకులు సైతం నివాళులర్పించిన వారిలో ఉన్నారు. కాగా, శ్రీకాంత్ మృతిపై ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, బాగం హేమంతరావు, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు తదితరులు సంతాపం ప్రకటించారు.



యర్రా శ్రీకాంత్ (ఫైల్)

కార్మిక కుటుంబంలో జన్మించి..

ఖమ్మంలోని సాధారణ కార్మిక కుటుంబంలో జన్మించిన యర్రా శ్రీకాంత్ విద్యార్థి దశలో ఎస్‌ఎఫ్‌ఐ ద్వారా ఉద్యమాల్లో పాల్గొన్నారు. 1980లో సీపీఎంలో చేరి 1991నుండి పూర్తికాలం కార్యకర్తగా పనిచేస్తున్నారు. 2019లో రాష్ట్ర కమిటీ సభ్యుడిగా తొలిసారి ఎన్నికైన ఆయన 2021, 2025లో జరిగిన రాష్ట్ర మహాసభల్లోనూ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. సీఎంగా చంద్రబాబునాయుడు ఉన్నప్పుడు అసంఘటితరంగ కార్మికులు 1,300 మందిని సమీకరించి ఉద్యమించిన శ్రీకాంత్ వారికి పీఎఫ్, ఇతర సౌకర్యాలు సాధించారు. 2000లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో కీలకపాత్ర పోషించడంతో పాటు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కార్మికుల తరఫున పోరాడమే కాక మార్కెట్ తరలింపును ఆపాలని ఉద్యమించారు. పట్టణంలో పేదలకు ఇళ్ల స్థలాల సాధనకు పదేళ్ల పాటు జరిగిన పోరాటంలో కీలకంగా వ్యవహరించి వెంకటగిరి, కోటనారాయణపురం, సత్యనారాయణపురం తదితర ప్రాంతాల్లో స్థలాలు, ఇళ్లు ఇప్పించారు. విద్యుత్ పోరాటంలో జైలు జీవితం కూడా గడిపారు.

ఎంపీ పరామర్శ

గుండెపోటుతో మధురైలో మృతి చెందిన ఎర్రా శ్రీకాంత్ కుటుంబీకులను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర పరామర్శించారు. ఆయన వెంట కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, తోట వీరభద్రం, మాజీ కౌన్సిలర్ ప్రసాద్ తదితరులు ఉన్నారు.



శ్రీకాంత్ కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎంపీ రవిచంద్ర

కుండలు సరే.. తాగునీరు ఏదీ?

- కేఎంసీ పరిధిలోని అన్ని డివిజనల్లో ఇదే పరిస్థితి
- కొన్నిచోట్ల మాయమవుతున్న కుండలు



నాలుగు కుండలకు బదులు మిగిలిన మూడు..



కొత్త బస్టాండ్ సమీపాన ఏర్పాటు చేసిన చలివేంద్రం



ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా నలుమూలల నుంచి వివిధ పనుల నిమిత్తం ప్రజలు ఖమ్మం వస్తుంటారు. ఎండల నేపథ్యాన వీరి దాహార్తి తీర్చేందుకు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నగరంలోని రద్దీ ప్రాంతాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. లక్ష్యం మాత్రం చేరే పరిస్థితి కానరావడం లేదు. చలివేంద్రాల్లో మట్టికుండలు ఏర్పాటుచేసి వారం గడుస్తున్నా ఇప్పటి వరకు తాగునీరు నింపకపోవడం గమనార్హం. అయితే, కార్పొరేటర్ల చేతుల మీదుగా ప్రారంభించాలనే భావనతో వేచి ఉన్నారని, అందుకే నీరు నింపడం లేదనే చర్చ జరుగుతోంది.

76 కేంద్రాల్లో ఏర్పాటు

ఖమ్మంలోని 60 డివిజన్ల పరిధిలో రద్దీ ఉండే 76 ప్రాంతాల్లో చలివేంద్రాల ఏర్పాటుకు నిర్ణయించారు. ఈ బాధ్యత ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు తెలిసింది. సదరు కాంట్రాక్టర్ అధికారులు చూపించిన ప్రాంతాల్లో చిన్న గుడిసె వేసి నాలుగు చొప్పున కుండలు ఏర్పాటు చేయడమే కాక ప్లాస్టిక్ గ్లాసులు పెట్టారు. ఆపై కుండల్లో రోజూ నీరు నింపే బాధ్యతను లైన్‌మెన్లకు అప్పగించినట్లు తెలిసింది. కానీ ఇప్పటివరకు ఎక్కడా నీరు నింపకపోవడంతో చలివేంద్రం ఉంది కదా అని ఆశగా వచ్చిన వారు నిరాశగా వెనుదిరగక తప్పడం లేదు. ఇక కొన్నిచోట్ల ఒక్కో కుండ మాయమవుతూ నాలుగుకు బదులు రెండు, మూడు కుండలే కనిపిస్తున్నాయి.

భారీగా ఖర్చు..

కేఎంసీలో ఏ పని చేసినా.. నాలుగింతలు లాభం ఉండేలా అధికారులు అంచనాలు రూపొందించి కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తున్నారనే విమర్శలు పెరుగుతున్నాయి. ఇందులో భాగంగానే చలివేంద్రాల ఏర్పాటులో ఖర్చు భారీగా చూపించేలా బిల్లులు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. నాలుగు తడికలు, ఒక షేడ్‌నెట్, నాలుగు కర్రలు, నాలుగు కుండలతో ఏర్పాటు చేసిన ఒక్కో చలివేంద్రానికి రూ.15 వేల నుండి రూ.18,750 వరకు ఖర్చయిందని బిల్లుల్లో పేర్కొన్నట్లు సమాచారం. మొత్తంగా చలివేంద్రాల ఏర్పాటు పేరుతో సుమారు రూ.14 లక్షలకు పైగా బిల్లులు సిద్ధం చేసినట్లు చర్చ జరుగుతుంది. ఈ అంశంపై కేఎంసీ అధికారులను వివరణ కోరగా.. రెండు రోజుల్లో కార్పొరేటర్లకు సమాచారం ఇచ్చి చలివేంద్రాలను ప్రారంభిస్తామని తెలిపారు. కుండల్లో నీరు బాధ్యత లైన్‌మెన్లకు అప్పగించామని, ఈ విషయాన్ని పరిశీలిస్తామని వెల్లడించారు.

నిరాశే మిగిలింది..

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ ఆవరణలో నూతన హంగులతో ఆధునికీకరించిన ఆదివాసీ గిరిజన మ్యూజియాన్ని సీఎం రేవంత్‌రెడ్డితో ప్రారంభోత్సవం చేయించాలని ఐటీడీఏ అధికారులు తీవ్రంగా ప్రయత్నించారు. సీఎంతోపాటు చివరికి మంత్రులు, ఉన్నతాధికారులు సైతం ప్రారంభోత్సవానికి రాకపోవడంతో ఐటీడీఏ పీఓ, ఇతర అధికారులు నిరాశకు గురయ్యారు. ప్రారంభోత్సవం మధ్యాహ్నం 12.10 నుంచి 2.10 గంటల మధ్యలో ఉంటుందని పీఓ పర్యవేక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. 12గంటల నుంచి మ్యూజియం ముందు రోడ్డుపై నిలబడి ప్రారంభోత్సవానికి వచ్చే వారికి స్వాగతం పలికేందుకు వేచి చూడడం ప్రారంభించారు. మధ్యాహ్నం మూడు గంటలవరకు ఎదురుచూసి నిరాశ చెందిన పీఓ అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఆతర్వాత ఆయన కాసేపు తన కారులో, అనంతరం నూతనంగా నిర్మించిన తాటాకుల గుడిసెలో నిరీక్షించారు. పట్టణంలోని వివిధ గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు, గిరిజన సంఘాల నాయకులు, ఐటీడీఏ యూనిట్ అధికారులు ఎండలో వేచి ఉన్నా ఎవరూ రాలేదు. దీంతో ప్రారంభోత్సవం లేకుండానే పర్యాటకులను మ్యూజియం సందర్శనకు అనుమతించారు.

చింతల చెరువులో పడి వృద్ధురాలి మృతి

పాల్వంచ: చింతల చెరువులో కాలు జారి పడి వృద్ధురాలు మృతి చెందిన సంఘటన ఆదివారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని కొమ్ముగూడెనికి చెందిన కోమటి నాగరత్నమ్మ(78) కొద్ది రోజులుగా నరాల నొప్పితో ఇబ్బంది పడుతోంది. ఈ క్రమంలో ఈ నెల 5న ఉదయం 9 గంటల సమయంలో పాత పాల్వంచలోని ఆర్‌ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా ఆదివారం చింతలచెరువులో మృతదేహం తేలడంతో స్థానికులు గుర్తించారు. వైద్యుడి వద్దకు వెళ్లి చెరువు కట్ట మీద నుంచి వస్తున్న క్రమంలో కాలు జారి పడి మృతి చెంది ఉండవచ్చని కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదు చేయగా, ఎస్‌ఐ సుమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నువ్వు అందంగా ఉన్నావు...

- సర్జరీ కోసం వచ్చిన వివాహితతో వైద్యుడు, సిబ్బంది వెకిలిచేష్టలు
- శస్త్రచికిత్స కాగానే ఆందోళనతో డిశ్చార్జి

ఖమ్మంవైద్యవిభాగం: 'నువ్వు చాలా అందంగా ఉన్నావు.... తక్కువ వయస్సులా కనిపిస్తున్నావు.. చదువుకున్న ఆఫీసర్‌లా ఉన్నావు.. బొద్దుగా కనిపిస్తున్నావు..' అంటూ ఓ వివాహితతో ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడు, సిబ్బంది అమానుషంగా ప్రవర్తించారు. చేయి విరిగిన ఆమె సర్జరీ కోసం రాగా.. వైద్యులు, సిబ్బంది ప్రవర్తనతో హడలి భయభ్రాంతులకు గురికాగా.. ఘటనపై వివాహిత బంధువులు యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి.

వైరా నియోజకవర్గానికి చెందిన ఓ వివాహిత ఇంట్లో పనులు చేస్తుండగా కిందపడటంతో చేయికి తీవ్రంగా గాయమైంది. సమీపంలోని ఆర్‌ఎంపీని సంప్రదిస్తే చేయి విరిగిందని నిర్ధారించి ఖమ్మంలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సమీపాన శివ ఆర్థోపెడిక్ ఆస్పత్రికి తీసుకువచ్చాడు. అక్కడ పరీక్షించాక సర్జరీ చేయాలని చెప్పడంతో గత గురువారం ఆస్పత్రిలో చేరింది. శుక్రవారం సర్జరీ చేసేందుకు నిర్ణయించగా, ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లాక సదరు మహిళపై సిబ్బంది అసభ్యకరంగా వ్యాఖ్యలు చేయడం ప్రారంభించారు. ఆపై ఆపరేషన్ చేయడానికి వైద్యుడు కూడా అదే మాదిరి ప్రవర్తించాడు. కేస్‌షీట్‌లో వివరాలన్నీ ఉన్నా వయస్సు ఎంత అని అడిగి చెప్పగానే అంత వయస్సులా కనిపించడం లేదు... అందంగా ఉన్నావు... తెల్లగా, వయస్సు తక్కువగా కనిపిస్తున్నావు... అంటూ మాట్లాడడంతో ఆమె భయాందోళనకు గురైంది. ఆతర్వాత థియేటర్ నుంచి బయటకు వచ్చాక కుటుంబీకులకు చెప్పడంతో డాక్టర్, సిబ్బందిని నిలదీస్తే అలాంటిదేమీ బుకాయించారు. దీంతో కొద్దిరోజులు ఆస్పత్రిలోనే ఉండాల్సి ఉన్నా ఇష్టపడని మహిళను డిశ్చార్జ్ చేయించి తీసుకెళ్లాపోయారు. కాగా, ఘటనపై ఆస్పత్రి యాజమాన్యానికి వివాహిత కుటుంబీకులు ఫిర్యాదు చేయగా, ఆమె ఆరోగ్యం చక్కబడ్డాక అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు.

బీజేపీ బలోపేతానికి కృషి

ఖమ్మం మామిళ్లగూడెం /ఖమ్మం అర్బన్: జిల్లాలో బీజేపీ బలోపేతానికి విస్తృత కృషి జరుగుతోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరావు తెలిపారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని కార్యాలయంతో పాటు 9వ డివిజన్ రోటరీనగర్‌లో ఆదివారం ఆయన పతాకాన్ని ఎగురవేసి మాట్లాడారు. భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయని తెలిపారు. ఈనేపథ్యాన ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించామని చెప్పారు. ఈకార్యక్రమాల్లో నాయకులు సన్నె ఉదయ్‌ప్రతాప్, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు, అల్లిక అంజయ్య, శ్యాంరాథోడ్, రవీందర్‌రావు, సుధాకర్, కుమిలి శ్రీనివాసరావు, నీలిమ, సీతారాములు, నరేందర్, హుస్సేన్, రాము తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ జెండా ఎగురవేసి మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు



నినాదాలు చేస్తున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, నాయకులు

పాలేరు నియోజకవర్గంలో...

ఖమ్మంరూరల్/నేలకొండపల్లి: పాలేరు నియోజకవర్గంలోని వివిధ మండలాలు, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో పార్టీ పతాకాన్ని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుండి నేటి వరకు జాతీయ వాదం, దేశ సమగ్రత, అట్టడుగు వర్గాలకు న్యాయమే లక్ష్యంగా కృషి జరుగుతోందని తెలిపారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదించిన వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో పేద ముస్లింలకు లబ్ధి జరుగుతుందనే విషయమై పార్టీ శ్రేణులు ప్రచారం చేయాలని సూచించారు. బీజేపీ, అనుబంధ సంఘాల నాయకులు పాగర్తి సుధాకర్, చావా కిరణ్, బానియా నాయక్, రామయ్య, వెంకట్, వెంకన్న, అనంతు ఉపేందర్ గౌడ్, సంతోష్‌రెడ్డి, షేక్ షర్ఫొద్దీన్, గెల్లా చక్రపాణి, సయ్యద్ మోహినుద్దీన్, మూడ్ రమేష్, ఎలిగేటి గిరి, కందరబోయిన గోపి తదితరులు పాల్గొన్నారు.